క్లుప్తంగా

కొనసాగుతున్న ఓటర్ స్లిప్‌ల పంపిణీ



ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓలు

జూలూరుపాడు: మే 13న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటర్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం మండలవ్యాప్తంగా కొనసాగుతోంది. ఎన్నికల అధికారుల ఆదేశాలతో బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్లకు స్లిప్‌లను అందజేస్తున్నారు. మండలంలో 27,632 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 13,659 మంది, మహిళా ఓటర్లు 14,018 మంది ఉన్నట్లు తహసీల్దార్ కె.స్వాతిబిందు తెలిపారు. ఈ నెల 25 నుంచి ఓటర్ స్లిప్‌ల పంపిణీ ప్రారంభమైందని, ఈ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

అస్తవ్యస్తంగా పనులు



ఫ్లోరింగ్ పనుల కోసం తరగతి గదిలో చేపట్టిన తవ్వకాలు

పాల్వంచరూరల్: ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతుల కోసం ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. నిధులు మంజూరు చేసింది. వీటితో పారదర్శకంగా పనులు నిర్వహించాల్సి ఉండగా.. ప్రత్యేకాధికారి పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో అస్తవ్యస్తంగా నిర్వహిస్తున్నారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని దంతలబోరు గ్రామ పంచాయతీలోని గంగదేవిగుప్ప గ్రామంలో అమ్మ ఆదర్శ కమిటీ కింద ప్రభుత్వ పాఠశాలలో ఫ్లోరింగ్, విద్యుత్ మరమ్మతులు, తాగునీటి సౌకర్యం కోసం నెల రోజుల రిందట రూ.3లక్షల20వేలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలల్లోని తరగతి గదుల్లో ఫ్లోరింగ్ పనుల్లో నాసిరకం నాపరాళ్లను వినియోగించేందుకు సిద్ధం చేశారని, వాటిని వినియోగించక ముందే చర్యలు తీసుకుని నాణ్యమైన వస్తువులను వినియోగించాలని స్థానికులు తెల్లం మల్లేశ్ అధికారులను కోరారు.

నాణ్యమైన రాళ్లు ఉపయోగిస్తాం

అమ్మ ఆదర్శ కమిటీ నిధులతో పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఫోరింగ్ పనులను పరిశీలించి నాసిరకంగా ఉన్న నాపరాళ్లను తొలిగించి వాటిస్థానంలో నాణ్యమైన రాళ్లను వినియోగిస్తాం. ఫ్లోరింగ్‌కు వినియోగించే నాపరాళ్లను చూశాం. వాటిని మార్చాలని కూడా స్కూల్ హెచ్‌ఎంకు తెలిపాం.

-సరస్వతి (ప్రత్యేకాధికారి)

ముగిసిన జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ క్రీడాపోటీలు




విజేతలకు బహుమతులు అందిస్తున్న డైరెక్టర్ బి.లక్ష్మయ్య

పాల్వంచ: స్థానిక కేటీపీఎస్ క్రీడా మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిసాయి. ఈ పోటీల్లో జూరాల ప్రాజెక్ట్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, కేటీపీఎస్ 7వ దశ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్స్‌గా కేటీపీఎస్ 5, 6 దశలకు చెందిన ఏడీఈ దంతెనబోయిన సతీశ్ నిలిచారు. విజేతలకు జెన్‌కో డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్య బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీఈలు ఎం.ప్రభాకర్‌రావు, పి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసబాబు, గేమ్స్ సెక్రటరీలు వీరస్వామి, వై.వెంకటేశ్వర్లు, వీరూనాయక్, శ్రీధర్, లక్ష్మణ్, వైటీఎంకె.రాజు పాల్గొన్నారు.

లబ్ధిదారుల్లో గుబులు..

- యూనిట్లు లేకుంటే నిధుల రికవరీ?
- బీసీ, మైనార్టీ బంధు రుణాల్లో అధికారుల చర్యలు
- ఇల్లెందు నియోజకవర్గంలో 300 మంది లబ్ధిదారులు
- బిల్లుల కోసం పరుగులు



బీసీ బంధు లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ (ఫైల్)

ఇల్లెందు: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బీసీ, మైనార్టీలకు ఆర్థికాభివృద్ధికి బీసీ, మైనార్టీ బంధు పథకాలు ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఒక్కొక్కరికి యూనిట్ కింద రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసింది. అయితే, ఇన్నాళ్లు పట్టించుకోని అధికారులు ఇప్పుడు రంగంలోకి దిగి లబ్ధిదారులంతా ప్రభుత్వం ఇచ్చిన నిధులతో ఏర్పాటుచేసుకున్న యూనిట్ల బిల్లులు సమర్పించాలని ఆదేశించారు. 2023 ఆగస్టు 17న ఇల్లెందులో ఆనాటి ఎమ్మెల్యే హరిప్రియ 300 మందికి బీసీలకు బీసీ బంధు, 100 మందికి మైనార్టీ బంధు కింద రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. అయితే అధికారులు హడావుడిగా చెక్కులు అందజేసి అప్పట్లో చేతులు దులుపుకున్నారు. మళ్లీ ఎనిమిది నెలల తర్వాత అధికారులు లబ్ధిదారులు నెలకొల్పిన యూనిట్ల రశీదులు అందజేయాలని, లేనిపక్షంలో నిధులు రికవరీ చేస్తామని చెబుతుండటంతో సభ్యుల్లో ఆందోళన మొదలైంది. కాగా, చాలా మంది యూనిట్లు ఏర్పాట్లు చేయలేదని.. ఈ విషయంలో ఫిర్యాదులు అందటంతో అధికారులు బిల్లులు సమర్పించాలని సూచించినట్లు తెలుస్తోంది.

అప్పట్లో కొటేషన్

నిధులు మంజూరైన సమయాన లబ్ధిదారులు కొటేషన్ మాత్రమే సమర్పించినట్లు తెలిసింది. ఇందు కోసం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని షాపుల యజమానులు కొంత మేర వసూలు చేసినట్లు సమాచారం. ఆయా యూనిట్లకు కొటేషన్ ఉంటే సరిపోతుందని అటు లబ్ధిదారులు, ఇటు షాపుల యజమానులు కాలం గడిపారు. కానీ ఎనిమిది నెలల తర్వాత కొటేషన్‌తో పాటు తాము ఏర్పాటు చేసుకున్న యూనిట్‌కు సంబంధించి పూర్తిస్థాయిలో బిల్లులు సమర్పించాలని అధికారులు ఆదేశించారు. దీంతో హైరానాకు గురవుతున్న లబ్ధిదారులు బిల్లుల కోసం ఉరుకులు, పరుగులు తీస్తున్నారు.

వలసలను అరికట్టేందుకు..

చేతి వృత్తులను నమ్ముకుని జీవిస్తున్న అణగారిన వర్గాలను అభివృద్ధి చేయడం కోసం ఆనాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ బంధు అమలు చేసిన విషయం విదితమే. ఇల్లెందు నియోజకవర్గంలో 300 మందికి బీసీ బంధు, 100 మందికి మైనార్టీ బంధు కింద చెక్కులు పంపిణీ చేశారు. కుల వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారు వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఈ సహాయం ఉపయోగపడుతుందని భావించారు. కులవృత్తులపై ఆధారపడిన వృత్తిదారులు పనిని వదిలేసి బతుకు దెరువుకు పట్టణాలకు వలసలు వెళ్తుండడం సాధారణమైపోయింది. ఈ నేపథ్యాన వలసలను అరికట్టడం, స్వస్థలాల్లోనే ఉపాధి పొందేలా ఈ పథకాలను ప్రవేశపెట్టినట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది.

మళ్లీ ఖర్చే..

అధికారులు ఆయా యూనిట్లకు చెందిన కొటేషన్లు, బిల్లులు సమర్పించాలని తాజాగా సూచించారు. దీంతో లబ్ధిదారులు షాపుల వద్దకు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. దుకాణాదారులకు ఎంతో కొంత చెల్లించుకుని బిల్లులు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొటేషన్లకు, ఇప్పుడు బిల్లులకు డబ్బులు చెల్లిస్తుండడంతో ‘బంధు’ నిధులు సగం ఖర్చయిపోతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

రేపు కొత్తగూడెంలో రోడ్ షో



మాట్లాడుతున్న మురళి

కొత్తగూడెంరూరల్: ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి బుధవారం సాయంత్రం కొత్తగూడెంలో రోడ్‌షో ద్వారా ప్రచారం చేస్తారని పార్టీ నాయకులు ఆళ్ల మురళి, తూము చౌదరి, నాగా సీతారాములు తెలిపారు. చుంచుపల్లి మండలంలోని పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడారు. కొత్తగూడెంలో జరిగే రోడ్డుషోకు కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే, లోక్‌సభ ఎన్నికల్లో రఘురాంరెడ్డి విజయానికి పాటుపడాని తెలిపారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, నాయకులు తుళ్లూరు బ్రహ్మయ్య, తోట దేవీప్రసన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాతో పాటు దుర్గరాశి వెంకన్న, నాగేంద్ర త్రివేది, చీకటి కార్తీక్, బాలప్రసాద్, సత్యనారాయణరెడ్డి, పాషా, వెంకట్, జెల్లి కిరణ్, రజాక్, డాక్టర్ శంకర్‌నాయక్, గొల్లపల్లి దయానంద్, కౌన్సిలర్ జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

మే 3న మోడల్ ఎంసెట్, నీట్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): పాల్వంచలోని కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మే 3వ తేదీన నిర్వహిస్తున్న మోడల్ ఎంసెట్, నీట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు బొంతు రాంబాబు కోరారు. కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో సోమవారం మోడల్ పరీక్షల వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కోచింగ్ తీసుకోలేని విద్యార్థుల్లో భయం పోగొట్టేలా మోడల్ ఎంసెట్, నీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిపుణులైన అధ్యాపకులతో రూపొందించిన ప్రశ్నాపత్రం ద్వారా ఈ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు రూ.100 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు 94929 30835, 90143 04293, 99127 05719, 63016 47631 నంబర్లలో సంప్రదించాలని రాంబాబు సూచించారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న మాస్‌లైన్ నేత రాంమ్మూర్తి

ఇల్లెందురూరల్: ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మాస్‌లైన్ నాయకుడు సూర్నపాక రామ్మూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని ముత్తారపుకట్ట గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి కూలీలతో సోమవారం మాస్‌లైన్ నాయకులు మాట్లాడారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొలతలతో నిమిత్తం లేకుండా కూలీలకు రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలని, కూలీలకు తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, పనికి అవసరమైన సామగ్రిని ప్రభుత్వమే సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో ఆవుల కిరణ్, ఆజ్మీర బిచ్చ, కోరం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి 23వ వార్డు కూలీలైన్ సురక్ష ఆస్పత్రి లైన్‌లో ఉన్న 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చి 250 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి కరెంటు లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా తక్షణం చర్యలు చేపట్టాలని వార్డు కౌన్సిలర్ వై.శ్రీనివాస రెడ్డి తెలిపారు. సోమవారం వార్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ హేమంత్ కుమార్, ఎల్‌ఐ లక్ష్మీనారాయణ, జేఎల్‌ఎం సుదీర్, వార్డు పెద్దలు జూలూరు శ్రీనివాస్, ప్రకాష్, రాజకొమరయ్య, సత్యనారాయణ, శ్రీకాంత్, జహంగీర్, ముస్తఫా, కృష్ణ, సదానందం, నరేశ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రంగాపురం వాసికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రవినాయక్

పాల్వంచరూరల్: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన ఐటీసీలో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ మరోవైపు సినీ జానపద పాటలు పాడుతున్న కళాకారుడు బానోతు రవినాయక్‌కు డాక్టరేట్ లభించింది. దీనిని తెలంగాణ సాంస్కృతిక తెలుగు సాహితి బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ గౌరీశంకర్ ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన త్యాగరాయ గానసభలో ప్రదానం చేశారు. జానపద పాటలు, రచనలు చేసినందుకు గాను ఆయనకు డాక్టరేట్ ఇచ్చారు.

యువతి అదృశ్యం

ఇల్లెందు: పట్టణంలోని 13వ నెంబర్ బస్తీకి చెందిన 19 ఏళ్ల యువతి సోమవారం ఉదయం పాల ప్యాకెట్ కోసం బయట వెళ్లి ఇంటికి రాలేదు. పట్టణంలోని పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇల్లెందులో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు, సిబ్బంది

ఇల్లెందు: వచ్చే నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఇల్లెందు సబ్ డివిజన్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా విస్తృత పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నామని డీఎస్పీ ఎన్.చంద్రభాను స్పష్టం చేశారు. సోమవారం ఇల్లెందు పోలీస్‌స్టేషన్ నుంచి ఫ్లాగ్‌మార్చ్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, గోవింద్ సెంటర్, బుగ్గవాగు, జగదాంబ సెంటర్ మీదుగా ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలను పర్యవేక్షించేందుకు సబ్ డివిజన్‌లోని వివిధ పోలీస్ స్టేషన్‌లకు చెందిన 300 మందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజల్లో మనోధైర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఇల్లెందు, గుండాల, టేకులపల్లి సీఐలు కరుణాకర్, శ్రీనివాస్, సురేశ్, ప్రత్యేక పోలీస్ బలగాలు, పోలీసులు, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో రఘురాంరెడ్డి గెలుపు ఖాయం



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): మతోన్మాదాన్ని పెంచిపోషిస్తూ మరోసారి గద్దెనెక్కేందుకు కుట్ర చేస్తున్న బీజేపీకి తెలంగాణతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్థానం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తును జనం ఆదరిస్తున్నారని తెలిపారు. ఈ అంశం అసెంబ్లీ ఎన్నికల్లో రుజువు కాగా, లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు అభ్యర్థి విజయానికి సీపీఐ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. నాయకులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, నగేశ్, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి పాల్గొన్నారు.

మేడే ఘనంగా నిర్వహించాలి



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: దేశంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతామని 138వ మేడే సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రతినభూనాలని తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జె.సీతారామయ్య పిలుపునిచ్చారు. మండలంలోని పెంకు పరిశ్రమలు, బొజ్జాయిగూడెం గ్రామంలో మేడే ప్రచార పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పనిదినం కోసం చికాగో కార్మికులు చేసిన వీరోచిత పోరాటం, వేతనాలు పెంపుదల, కార్మిక హక్కుల సాధన కోసం ప్రపంచవ్యాప్తంగా జరిగిన పోరాటాలను వివరించారు. ప్రపంచ కార్మికవర్గ పోరాట దినోత్సవాన్ని మేడేను అమరులవీరుల స్ఫూర్తితో జరపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాసుద్దీన్, ఏపూరి వీరభద్రం, కొండపల్లి శ్రీనివాస్, ఉమా, రాంబాబు, బజారి, లక్ష్మయ్య, శ్రీనివాస్, పాషా, సాంబ, ఆదినారాయణ, మహేందర్, సాయి పాల్గొన్నారు.

బలరాంనాయక్‌ని గెలిపించండి..



ప్రచారం చేస్తున్న ఏలూరి కోటేశ్వరరావు

టేకులపల్లి: కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ అనుబంధ కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ఏలూరి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక నాయకులతో కలిసి టేకులపల్లి మండలం మేళ్లపడుగు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశంలో ముమ్మరంగా ప్రచారం చేశారు. కూలీలతో కలిసి మట్టి పని చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కోరం కనకయ్యకు భారీ మెజారిటీ అందించిన స్ఫూర్తితో బలరాంనాయక్‌కు కూడా టేకులపల్లి మండలంలో భారీ మెజారిటీ వచ్చేలా ప్రతి ఒక్కరూ చేతి గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కొమరం చిట్టిబాబు, వీసం నీలమయ్య, మాలోతు హేమ్లానాయక్, లక్ష్మయ్య, రామనాథం, గంగినేని రామచంద్రరావు, సూర్నపాక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: ఇల్లెందులోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు ఇటీవల వెల్లడైన ఫలితాల్లో మంచి మార్కులు సాధించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉత్తమ ప్రతిభ చూపిన ఎస్‌కేహఫీజ్, ఎస్‌కే అర్షద్, ఈశ్వర్, రోహిత్, వంశీ, అఫ్సర్‌ను అభినందించారు. ఇందులో ఎస్‌కే హఫీజ్ రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించాడని ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్ తెలిపారు. అధ్యాపకులు కొండల్‌రావు, అశోక్, సైదావలి, సాధిక్, రేష్మా, నాగేశ్, ప్రసాద్, గౌస్, చైతన్య పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

పాల్వంచరూరల్: అత్తగారింటికి వెళ్తానని చెప్పిన యువకుడు కానరాకుండా పోవడంతో ఆయన తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని బంజర గ్రామపంచాయతీ పరిధి చిరుతానిపాడుకు చెందిన పద్దం ఉంగయ్య నెల కిందట ఉల్వనూరు కొత్తూరు గ్రామానికి చెందిన ఉంగిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ నెల 26వ తేదీన తన భార్య వద్దకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయలుదేరినా అక్కడకు వెళ్లకపోగా ఆచూకీ తెలియరాలేదు. దీంతో ఉంగయ్య తండ్రి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

బతుకు పోరాటం..గెలుపు ఆరాటం



ఒకరిది ఎన్నికల్లో గెలుపు కోసం ఆరాటం.. మరొకరిది బతుకుదెరువు కోసం పోరాటం అన్నట్లుగా ఉన్న ఈ దృశ్యం సోమవారం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో కనిపించింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ స్టేడియంలో నిర్వహించిన ప్రచార సభలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా పాల్గొన్నారు. ఓ పక్క సభ జరుగుతుండగా.. స్టేడియంలో మరోవైపు మహిళా కూలీ మాత్రం రోజువారీ పనిలో భాగంగా ఇసుక జల్లెడ పడుతూ కనిపించింది.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఖమ్మం

కేసీఆర్ రోడ్ షోకు తరలిరండి..

ఇల్లెందు/ఇల్లెందురూరల్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్ బుధవారం మహబూబాబాద్‌లో నిర్వహించే రోడ్ షోకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని నాయకుడు దిండిగాల రాజేందర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ఇల్లెందు మండలంలోని పలు గ్రామాల్లో కేసీఆర్ రోడ్ షో విజయవంతంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు శీలం రమేశ్, నాయకులు ప్రమోద్‌కుమార్, ఖమ్మంపాటి రేణుక, హనుమ, దాస్యం ప్రమోద్ పాల్గొన్నారు.

కొత్త తండాలో ఆలయం ప్రారంభం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు

టేకులపల్లి: మండలంలోని కొత్తతండా(పి) గ్రామంలో గుగులోత్ రామ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ సీతారామచంద్ర, వెంకటేశ్వరస్వామి ఆలయం శ్రీరామనవమి రోజు అంగరంగ వైభవంగా ప్రారంభించారు. సోమవారం ఆలయంలో 16 రోజులైన సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు దంతోజు అశోకాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రామ, నాయకులు కోరం సురేందర్, భూక్య కృష్ణ, భూక్య సరిరాం, అజ్మీర కిషన్, గణేశ్, విజయ్, తులసీరాం పాల్గొన్నారు.

భానుడి ప్రతాపంతో నిర్మానుష్యం



రెండు రోజులుగా ఎండలు మండిపోవడంతో జనం ఉదయం నుంచి సాయంత్రం వరకు బయటకు రావాలంటే జంకుతున్నారు. మండలంలోని జగన్నాథపురం, కేశవాపురం గ్రామాల మధ్య నిత్యం భక్తులతో రద్దీగా ఉండే పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణం ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా మారింది. ఉదయం 8 గంటల నుంచే ఎండ వేడి బాగా ఉంటుండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు.

-పాల్వంచరూరల్